


రేపు నారావారిపల్లికి చంద్రబాబు

తమ్ముని కర్మక్రియలకు రాక



ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం నారావారిపల్లికి రానున్నారు. తమ్ముడు నారా రామ్మూర్తినాయుడు కర్మక్రియలకు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ముందస్తు భద్రత ఏర్పాట్ల తనిఖీలో భాగంగా ఎస్పీతో కలిసి సమీక్షించి, నారావారి పల్లెలో సిఎం పర్యటన ప్రాంతాలను కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పరిశీలించారు. ఎటువంటి చిన్నపాటి లోపాలకు తావివ్వరాదని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాలను చంద్రగిరి ఎంఎల్ఎ పులివర్తి నాని పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శాప్ చైర్మన్ ఎ.రవి నాయుడు, అదనపు ఎస్పి లు రవి మనోహరాచారి, శ్రీనివాసులు, ఆర్డీఓ లు భాను ప్రకాష్ రెడ్డి, రామ్మోహన్ పాల్గొన్నారు.



తిరుపతి కలెక్టరేట్ వద్ద జరిగిన భారీ ధర్నాలో నిత్యావసరాలపై వినూత్న నిరసన

కదం తొక్కిన కార్మిక కర్షక

కనీస వేతనం రూ.26వేలివ్వాలి
స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి
కలెక్టరేట్ వద్ద భారీ ధర్నాలో నేతలు

ఏం కొనేటట్టు లేదు..ఏం తినేటట్టు లేదు..!

కార్పొరేట్ల కొమ్ముగాస్తూ, కార్మికుల పొట్టగొట్టే విధానాలను అమలు చేస్తున్న కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలను ఎండగడుతూ జాతీయ పిలుపు మేరకు కార్మిక కర్షకులు తిరుపతి కలెక్టరేట్ వద్ద కదం తొక్కారు.. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, రైతుసంఘం, సమాఖ్య ఆధ్వర్యంలో భారీ ధర్నా జరిగింది. తుపాను హెచ్చరికలు ఉన్నా జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో కార్మికులు, కర్షకులు మంగళవారం ఉదయం కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదంటూ నిత్యావసరాల ధరల పెరుగుదలపై సరుకులు, గ్యాస్ ఉంచి వినూత్నంగా ప్రదర్శించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ అదానీని తక్షణమే అరెస్టు చేసి, సిబిఐ, ఈడి దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం పెరగకపోగా, రోజురోజుకూ భారాలు గుదిబండగా మారాయన్నారు.

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, తిరుపతి టౌన్

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను ఉల్లంఘించి పాలన సాగిస్తున్నాయని, కార్మికుల సంక్షేమం పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిరుద్యోగులకు తక్షణమే ఉపాధి కల్పించేలా ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. తిరుపతి జిల్లాలో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారని, కనీస వేతనం 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ గౌతమ్ అదానీని వెనుకేసుకుని రావడం వల్లే లంచాలు ఇచ్చి సోలార్ విద్యుత్ ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆరోపించారు. జిల్లాలో ఉండే ప్రజా ప్రతినిధులు సామాన్య మధ్యతరగతి ప్రజల అభివద్ధికి కషి చేయాలన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హేమలత మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో షుగర్ ఫ్యాక్టరీలను మూసేశారని, వాటిని తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించి రైతులకు ఆదుకోవాలన్నారు. రేణిగుంట, చిత్తూరు షుగర్ కోఆపరేటివ్ ఫ్యాక్టరీలు తెరిపించాలన్నారు. చెరుకు రైతులకు మద్దతు ధర టన్నుకి 4000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు అవలంబిస్తున్న విధానాల వల్ల ఉద్యోగ కార్మికులు నష్టపోతున్నారని, వారికి ఎటువంటి లాభం జరగడం లేదన్నారు. రైతు సంఘం జిల్లా నాయకులు రామానాయుడు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పట్ల వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని, వారిని ప్రోత్సహించకుండా కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, గౌతమ్ ఆదాని వంటి వారికి మేలు చేసేలా వ్యవహరిస్తున్నారన్నారు. రైతులు సంఘటితంగా ఈ విధానాలను వ్యతిరేకించాలన్నారు

రైతు సంఘాల సమాఖ్య సలహాదారులు మాగంటి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ఇచ్చే విధంగా అసెంబ్లీలో ప్రత్యేక బిల్లు తీసుకువచ్చి అమలు చేయాలని కోరారు. ఐ ఎఫ్ టి యు నాయకులు వెంకటరత్నం మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. పాల ధరలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో నాయకులు జి.బాలసుబ్రమణ్యం, ఆర్.లక్ష్మి, ఎస్.జయచంద్ర, టి.సుబ్రమణ్యం, పి.సాయిలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

28 వరకూ భారీ వర్షాలు

తుపాను కంట్రోల్ రూం 0877-2236007

జిల్లాలో ప్రజానీకం చలికి గజగజ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

బంగాళాఖాతంలో అల్పపీడనం వల్ల తిరుపతి జిల్లాలో భారీ వర్ష సూచన నేపథ్యంలో మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ చెప్పారు. 28వ తేదీ వరకూ అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురియనున్నాయని తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మండల స్థాయిలో కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎటువంటి ఆస్తి, మానవ, పశు ప్రాణ నష్టం జరగకుండా అన్ని రకాల చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ముందస్తు చర్యలపై దిశానిర్దేశం చేశారు. రెండు రోజులుగా చలిగాలులకు ప్రజలు చలికి వణుకుతున్నారు. లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేయాలన్నారు. అధికారులందరూ 24/7 వారి కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని తెలిపారు.



కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్: 0877-2236007
గూడూరు సబ్ కలెక్టరేట్ 08624 - 252807
సూళ్లూరుపేట ఆర్ డి ఓ : 08623-295345
తిరుపతి ఆర్‌డిఓ 7032157040
శ్రీకాళహస్తి ఆర్ డి ఓ : 8555003504

మళ్లీ పంట పొలాల్లోకి ఏనుగులు

ప్రజాశక్తి- చిన్నగొట్టిగల్లు మళ్ళీ ఏనుగుల గుంపు రైతుల పంటపొలాలపై పడి ధ్వంసం చేశాయి. మళ్ళీమళ్ళీ ఏనుగులు పంటలను ధ్వంసం చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం రాత్రి స్థానిక బొగ్గలవారిపల్లి రైతులు రాజన్న, సుబ్రమణ్యం, చెంగల్రాయులు, చిన్నబ్బ చెరకుతోట తిని తొక్కి నాశనం చేసాయి. టెంకాయ చెట్లను వేర్లతో సహా పెకలించి తీవ్ర నష్టం కలిగించాయి. కోటి ఆశలతో అప్పులు చేసి ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను రాత్రికిరాత్రి నాశనమౌతుండడంతో చేసిన అప్పులు తీరే దారిలేక రైతులు లబోదిబోమంటున్నారు. అటవీశాఖ సిబ్బంది ఏనుగుల సంచారాన్ని గమనించి దగ్గరలోని అడవిలోకి తరిమివుంటే ఈనష్టం జరిగివుండేది కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే స్వయంగా వచ్చి రైతులతో మాట్లాడి ధైర్యం చెప్పి ఫారెస్ట్ సిబ్బందిని ఏనుగుల సంచారంపట్ల నిఘా వుంచాలని ఆదేశించి వెళ్ళిన గంటల వ్యవధిలోనే తిరిగి ఏనుగులు పంటలను ధ్వంసం చేయడం ఆందోళన కలిగిస్తోంది. నాలుగు రోజులుగా ఏనుగుల గుంపు స్థానికంగా తిష్టవేయడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనలో వున్నారు. ఏనుగుల బారి నుండి కాపాడేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని ,నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కల్తీలకు కళ్లెం ఏది..!

'మమ' అనిపిస్తున్న తనిఖీలు
కానరాని 'ధరల' సూచి బోర్డులు
ఎరువుల విక్రయాల్లో మోసం



ఎరువుల తనిఖీలు (ఫైల్)

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

కల్తీ ఎరువులతో రైతులు దగా పడుతున్నారు. వాటి వలన దిగుబడులు కోల్పోతున్నారు. విక్రయించే వారు మాత్రం దండిగా లాభాలను ఆర్జిస్తున్నారు. మరోవైపు పురుగు మందు డబ్బాలపై ఉండే దానికి విక్రయించే ధరకూ పొంతన ఉండటం లేదు. ఇక బయోకెమికల్స్, ఫర్టిలైజర్స్ ధరలు రైతులకు తెలీవు. దీన్ని అవకాశంగా చేసుకొని వ్యాపారులు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. అందినకాడికి దండుకున్నారు. రైతు పెట్టే పెట్టుబడులలో ఎరువులు, పురుగుమందులకు సింహభాగం ఖర్చు చేస్తుండగా అవే నకిలీ, కల్తీ కావడం వారి పుట్టిముంచుతోంది. వీటికి అడ్డుకట్ట వేయాల్సిన వ్యవసాయ అధికారులు రైతులు ఫిర్యాదు చేసినా ఆధారాలు కావాలని కోరడం విడ్డూరం.. వారు జరిపే తనిఖీలు 'మమా' అనే రీతిలోనే సాగుతుండటం గమనార్హం.

రైతులకు నాలుగు రూపాయలు మిగిలాలంటే అదునులో వర్షాలు కురవాలి. పదునులో విత్తు పడాలి. ఆ తరువాత చీడపీడలు ఆశించకుండా సస్యరక్షణ జరగాలి. తుది దిగుబడులు బాగుండి గిట్టుబాటు ధరలు దక్కితేనే పెట్టుబడులు పోను లాభాలు ఆర్జించేది. వీటిలో వర్షాలు ప్రకతిపరంగా వచ్చేవి. ఆ తరువాత సస్యరక్షణ. చీడ, పీడలు ఆశించకుండా పురుగుమందులు, పైరుకు బలానికి ఎరువులు వాడాలి. అయితే ఎరువులు, పురుగుమందుల విషయంలో మాయాజాలం నడుస్తోంది. శ్రీకాళహస్తి వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో నిర్వహిస్తున్న పలు ఎరువుల దుకాణాల్లో కల్తీ ఎరువులు, పురుగు మందులు, నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి.

తనిఖీలు 'మమ'

శ్రీకాళహస్తి వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో మొత్తం 36 ప్రైవేటు ఎరువుల దుకాణాలను నిర్వహిస్తున్నారు. శ్రీకాళహస్తి రూరల్, అర్బన్ పరిధిలో 15, తొట్టంబేడులో 4, కేవీబీపురంలో 10, బుచ్చినాయుడుకండ్రిగలో 7 దుకాణాలు చొప్పున నిర్వహిస్తున్నారు. అయితే పలుచోట్ల వ్యాపారులు ఎరువుల్లో కల్తీ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పేరున్న కంపెనీల నుంచి వచ్చే ఎరువులు, పురుగు మందులు కాకుండా నాశిరకంవి విక్రయిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. కొనుగోలు సమయంలో కనీసం బిల్లులు కూడా రైతులకు ఇవ్వని పరిస్థితి. ముఖ్యంగా మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (ఎంఓపీ)లో ఎక్కువ కల్తీ జరుగుతున్నట్లు తెలుస్తోంది. అలాగే యూరియా బస్తాలో నత్రజని 23శాతం ఉండాలి. కానీ కల్తీ కారణంగా అది తగ్గిపోతోందని రైతులు అంటున్నారు. పురుగు మందులకు సంబంధించి డబ్బాపై ఉండే ధరకు దుకాణదారుడు విక్రయించే దానికి పొంతన ఉండటం లేదు. ఈ నేపథ్యంలో ఒకే కంపెనీ పురుగుమందు డబ్బా ధర ఒక్కో దుకాణంలో ఒక్కో విధంగా విక్రయిస్తున్నారు. అలానే కొందరు రైతులు సరుకు కొన్న వెంటనే బిల్లులు ఇవ్వరు. తరువాత వారికి అనుకూలంగా బిల్లులు రాసుకుంటున్నారు. చేమూరులోని ఓ ఎరువుల దుకాణంపై పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రైతులనుంచి వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో వారం రోజులుగా పెద్ద ఎత్తున ప్రయివేట్ ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్నారు. అయితే ఏఒక్కరిపై కూడా ఇప్పటి వరకూ కేసు నమోదు చేయలేదు. గతేడాది కేవలం ఒక్క కేసు మాత్రమే నమోదైంది. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి రైతులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రైతులు అప్రమత్తంగా ఉండాలి
ఏడీఏ, రమేష్ బాబు, శ్రీకాళహస్తి

రైతు ప్రయోజనాలను కాపాడటంలో వ్యవసాయశాఖ ఎపుడూ అప్రమత్తంగా ముందుంటుంది. రైతులు ఎరువులు లేదా పురుగుమందులు కొన్న వెంటనే బిల్లులను రైతులు తీసుకోవాలి. కల్తీ అనీ, ఎక్కువ ధరలు తీసుకుంటున్నారనిఅనుమానం వచ్చినపుడు వెంటనే స్థానిక వ్యవసాయశాఖ అధికారుల దష్టికి తీసుకురావాలి.

రబీకి ఊరట

చినుకుతో చిగురించిన ఆశ
జిల్లాపై అల్ప పీడన ప్రభావం



ప్రజాశక్తి - డక్కిలి

జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు రైతుల్లో ఆశలు చిగురింపజేస్తున్నాయి. మంగళవారం నుండి మండలంలో కురుస్తున్న వర్షాలకు రైతన్నలు పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. నెలరోజుల క్రితం నుంచే రైతులు నారుమడులు పోసుకొని భూము లను దుక్కి దున్నుకొని వరి నాట్లు వేసుకునేందుకు సమాయత్తం చేశారు. అప్పటి నుంచి వర్షం ఎప్పుడు వస్తుందా? అని ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం చిరుజల్లులు కురుస్తున్నప్పటికీ రాబోయే రెండు రోజుల్లో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడిస్తుండడంతో పంటలు సాగు చేసుకునేందుకు రైతన్న లు సిద్ధమవుతున్నారు. మెట్ట పంటలైన నిమ్మ తోటల్లో పూత వచ్చేందుకు ఈ వర్షం ఊపిరి పోస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఇప్పటికే వరినారు మడులు సిద్ధం చేసుకున్న రైతులకు ఈ వర్షం ఉపయోగకరంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. చెరువుల కింద సాగు చేయనున్న వరిపంటకు ప్రయోజనకరం కానుంది.

జిల్లాలో 433.1 మిల్లీమీటర్ల వర్షపాతం...

తిరుపతి జిల్లాలో నవంబర్ మాసంలో సాధారణ వర్షపాతం 530.6 మిల్లీమీటర్ల కాగా ఇప్పటివరకు 433.1 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ లోటు వర్షపాతంను అల్ప పీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు భర్తీ చేసి సాధారణ వర్షపాతం కు మించి వర్షాలు కురుస్తాయని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. వెంకటగిరి వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో 12,000 హెక్టార్లలో వరి సాగు కావాల్సి ఉండగా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఇప్పటివరకు 1000 హెక్టార్లలో మాత్రమే వరి నాట్లు పూర్తయ్యాయని వెంకటగిరి వ్యవసాయ శాఖ ఏడి ఎం.నాగార్జునసాగర్ తెలియజేశారు. ఇప్పటివరకు బోరు బావులు ఆధారంగా చేసుకుని సాగు చేసే రైతులు మాత్రమే వరి నాట్లు పూర్తి చేసుకున్నారు. గత వారంలో స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకష్ణ ఆధ్వర్యంలో డక్కిలి మండలంలోని నాగులపాడు తెలుగు గంగ బ్రాంచ్ కాలువ ద్వారా ఆయా ప్రాంతాల్లోని పలుగొడు, నాగులపడు, శ్రీపురం, మాటుమడుగు, దందవోలు తదితర చెరువులకు నీరు విడుదల చేయడంతో ఆ ప్రాంతంలోని రైతులు సాగుకు సన్నద్ధమయ్యారు. అయితే తెలుగు గంగ కాలువ ఎగువ ప్రాంతంలోనీ రైతాంగానికి ఈ వర్షంతో పంటలకు నీరు అందే అవకాశం ఉండడంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. రైతులకు చిన్న సాగునీటి వనరులైన చెరువులే పంటల సాగుకు ఆధారం. వెంకటగిరి మండలంలో 102, డక్కిలిలో 62, బాలాయపల్లిలో 92 చెరువులు ఉన్నాయి. ఈ చెరువుల్లో అక్టోబర్ మాసం వరకు నీరు లేక వెలవెలబోయాయి. అక్టోబర్ మాసంలో జిల్లాలో సాధారణ వర్షపాతం 203.5 మిల్లీమీటర్లు కాగా 282.3 వర్షం కురిసి రైతుల్లో ఆశలు చిగురింపజేసింది. సాధారణ వర్షపాతం కంటే అధికంగా కురవడంతో అప్పట్లో నియోజకవర్గంలోని చెరువుల్లో సగానికి పైగా నీరు చేరింది. అయితే చెరువు ల్లో పూర్తిస్థాయిలో నీరు లభ్యత లేకపోవడంతో నార్లు పోసుకున్న రైతులు నాట్లు వేసేందుకు ఆలోచనలో పడ్డారు. ఇలాంటి తరుణంలో అల్పపీడన ప్రభావంతో రాబోయే రెండు మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయినీ వాతావరణ శాఖ వెల్లడిస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం నుండి కురుస్తున్న వర్షాలకు వెంకటగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో చెరువులు, కుంటలు క్రమంగా నిండుతున్నాయి. ఈ వర్షాలు ఉద్యాన తోటలు, ఆరుతడి పంట అయిన మినుము తోపాటు వరిసాగుకు అనుకూలంగా ఉన్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

తిరుపతిలో 6 లైన్ల రహదారి

17 కి.మీ వరకూ భారీ ఫ్లైఓవర్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతిలో గరుడ వారధి తరువాత మరో పెద్ద ఫ్లైఓవర్ నగర సరిహద్దుల్లో రానుంది. సి.మల్లవరం నుంచి తూకివాకం వరకూ 17 కిలోమీటర్ల వరకూ భారీ ఫ్లైఓవర్ నిర్మాణం జరగనుంది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ ఈనెల 5వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రజాప్రయోజనాల రీత్యా రహదారుల చట్టం కింద 1956 ప్రకారం ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది. దీన్ని నేషనల్ హైవే 71గా నామకరణం చేశారు.

చిత్తూరు -నాయుడుపేట ఆరు లైన్ల రహదారిగా రూపుదిద్దుకుంటోంది.



సి.మల్లవరం వద్ద ఈ నిర్మాణం ఆగిపోయింది. సదరు కాంట్రాక్టర్ ల్యాండ్ అక్విడేషన్ చేయలేదని పనులను ప్రారంభించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రహదారి నిర్మాణానికి కాంట్రాక్టర్ ఓకే చేశారు. 97.100 కిలోమీటర్ల వరకూ ఈ రహదారి నిర్మాణం మల్లవరం వరకూ ఆగి ఉంది. 114.500 దూరం నిర్మిస్తే తూకివాకం వరకూ 17 కిలోమీటర్ల దూరం ఫ్లైఓవర్ నిర్మాణం ఏడాదిలోపు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరినట్లు సమాచారం. మల్లవరం దగ్గర నుంచి తిరుచానూరు ఫ్లైఓవర్‌లో కలుసుకుంటుంది. వకుళమాత టెంపుల్, ఉప్పరపల్లి చెక్‌పోస్టు, అగ్రహారం సర్కిల్, తనపల్లి క్రాస్ ప్రాంతాల్లో రవాణా సౌకర్యం అండర్‌బ్రిడ్జిగా సాగనుంది. ఫ్లైఓవర్‌కు కుడి, ఎడమ ప్రాంతాల్లో సర్వీస్ రోడ్డు ఏర్పాటు కానుంది. ఇప్పటికే నేషనల్ అథారిటీ వారు హద్దు రాళ్లను నాటి, జేసీబీలతో తవ్వకాలు చేపట్టారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయితే సి.మల్లవరం వద్ద టోల్‌గేట్ ఏర్పాటు చేసి వాహనదారుల వద్ద నుంచి 'టోల్' వసూలు చేసే అవకాశం ఉంది.

2-4 తేదీల్లో శెట్టిపల్లి భూముల బహిరంగ విచారణ : ఆర్‌డిఒ




ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

శెట్టిపల్లి ల్యాండ్ పూలింగ్‌లో అపరిష్కృత భూముల విషయమై తిరుపతి రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో డిసెంబర్ 2-4 తేదీల్లో మధ్యాహ్నం 2-4 గంటల వరకు బహిరంగ విచారణ జరగనుంది. శెట్టిపల్లి రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబరు 428 నుండి సర్వే నంబరు 474 లలోని వ్యవసాయ భూములకు సంబంధించిన అర్జీదారులు సోమవారం మధ్యాహ్నం అన్ని ఆధారాలతో హాజరు కావాలని ఆర్‌డిఒ తెలిపారు. సర్వే నంబరు 387 నుండి సర్వే నంబరు 408 లలోని ఇంటి స్థలాలకు/ ఇంటి జాగాలకు సంబంధించిన అర్జీదారులు 3న మధ్యాహ్నం, సర్వే నంబరు 409 నుండి సర్వే నంబరు 427, సర్వే నంబరు 475 లలోని ఇంటి స్థలాలకు/ ఇంటి జాగాలకు సంబంధించిన అర్జీదారులు 4న బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల వరకు రెవెన్యూ డివిజినల్ అధికారి కార్యాలయానికి హాజరుకావాలని కోరారు.

ప్రజలకు నిస్వార్ధ సేవలందిస్తా

విజిలెన్స్ అధికారి కరీమ్ ఉల్లా షరీఫ్



ప్రజాశక్తి-తిరుపతి సిటి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను అర్హులందరికి పారదర్శకంగా అందేలా కృషి చేస్తూ, కల్తీని అరికట్టి ప్రజలకు నిస్వార్ధ సేవలందిస్తానని రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కరీమ్‌ఉల్లా షరీఫ్ తెలిపారు. ఆర్‌సి రోడ్డులోని కార్యాలయంలో 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడారు. ఆయన మాటల్లోనే...

మాదీ ముందునుంచి పోలీసు కుటుంబమే. మా కుటుంబంలో నేను నాలుగో తరానికి చెందిన పోలీసు అధికారిని. మా తాత, ముత్తాతలు పోలీసు విభాగంలోనే సేవలందించారు. ముత్తాత, తాత, నాన్న, తమ్ముడు సైతం పోలీసు విభాగంలోనే పని చేశారు. తమ్ముడు ఎస్ఐ స్థాయి అదికారిగా ఉన్నారు. వారందరికి ప్రోత్సాహం, స్ఫూర్తితో ఉన్నత స్థాయి పోలీసు అధికారి కావాలనే లక్ష్యంతో పట్టుదల, క్రమశిక్షణతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాను.

కృష్ణాజిల్లాకు చెందిన అబ్దుల్ షరీఫ్, నూర్జహాన్ దంపతులకు నేను మొదటి సంతానం. నాన్న పోలీసు కావడంతో పలు ప్రాంతాలకు బదిలీలు తప్పలేదు. నా చదువు కూడా పలు ప్రాంతాల్లో జరిగింది. కైకలూరు, కృష్ణాజిల్లా, వెస్టుగోదావరి ప్రాంతాల్లో నా బాల్య విద్యాభ్యాసం సాగింది. ఎంఎస్‌సి పూర్తి చేసిన నేను 2005 నుంచి పోటీ పరీక్షలకు సిద్ధమవుతూ 2009లో డిఎస్‌పి పోస్టుకు ఎంపికై అనంతపురం జిల్లా కదరి డిఎస్‌పిగా మొదటి పోస్టింగ్‌లో జాయిన్ అయ్యాను. అనంతరం తిరుపతి సిఐడికి బదిలీ అయ్యాను. 2018లో ఉద్యోగోన్నతి పొంది పెనుగొండ ఏఎస్‌పిగా విధులు నిర్వహించారు. 2021లో హిందూపురంలో ఇంటిలిజెన్స్‌లో విధులు నిర్వహించాను. 2024లో తిరుపతి విజిలెన్స్ అంబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజనల్ అధికారిగా బాధ్యతలు చేపట్టాను. సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యే విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని, గమ్యం వైపు ప్రణాళిక బద్ధంగా, పట్టుదలతో నడవాలి. మనిషి బతుకును మార్చే శక్తి చదువుకు మాత్రమే ఉంది. దీన్ని గుర్తు పెట్టుకుని యువత ఇతర వ్యాపకాలకు బానిస కాకుండా చదువుల్లో రాణిస్తూ, పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని సూచించారు. తాను ముస్లింగా ఉన్న కదిరిలో విధులు నిర్వహించే సమయంలో అక్కడి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అయ్యప్పస్వాములకు, భక్తులకు నిత్యం ప్రసాదాలు పంపిణీ, అన్నదానం చేయడం చాలా తృప్తిగా అనిపిచ్చేది. కదిరి నరసింహస్వామికి వెళ్లే రహదారి చాలా ఇరుకుగా ఉండేది. రోడ్డు విస్తరణకు అనేక ఆటంకాల వల్ల గతంలో పూర్తి కాలేదు. నేను విధుల్లో చేరాక అక్కడి స్థానికులతో అనేక దఫాలుగా చర్చలు జరిపి, వారిని ఒప్పించి, విస్తారమైన రహదారిని ఏర్పాటు చేశాం. ఇప్పుడు అక్కడికి వెళ్లే భక్తులు, స్థానికులకు ఆ రోడ్డు ఎంతో సౌకర్యవంతంగా ఉంది. ఇప్పటి వరకు నేనున ఎక్కువ భాగం రాయలసీమ జిల్లాలోనే విధులు నిర్వహించాను. ఈ ప్రాంతంలోని ప్రజలకు స్నేహపూర్వక పోలీసుగా మెలిగి, అందరి అభిమానాన్ని పొందడం సంతోషంగా ఉంది. రాబోవు రోజుల్లోనూ పారదర్శికంగా, నిస్వార్ధసేవలందిస్తాను. ప్రజలకు, వినియోగదారులకు ఏదైనా సమస్య ఉంటూ ధైర్యంగా నాకు తెలియజేయాలి.



2018లో ఉత్తమ డిఎస్‌పి అవార్డు, 2023లో రాష్ట్ర ప్రభుత్వంచే సేవా పతకం అవార్డు తీసుకున్నారు.

మన భారత రాజ్యాంగం మహోన్నతం : కలెక్టర్


ఎపిఎస్పిడిసిఎల్ కార్యాలయంలో

ప్రజాశక్తి -తిరుపతి టౌన్, తిరుపతి సిటీ ప్రపంచంలో కెల్లా అత్యున్నత రాజ్యాంగం మన భారత రాజ్యాంగం అని, రాజ్యాంగ స్ఫూర్తిగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో భారత రాజ్యాంగ దినాన్ని కలెక్టర్ జెసి శుభం బన్సల్, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు జిల్లా అధికారులు తదితరులతో కలిసి ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి కలెక్టర్ పుష్పాంజలి ఘటించారు. అనంతరం రాజ్యాంగ ప్రవేశిక చదివి అందరితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు.

భారత రాజ్యాంగాన్ని తెలుగులో ముద్రించాలి : అంజయ్య

భారత రాజ్యాంగాన్ని ఆమోదించి సుమారు 75 ఏళ్ల కావస్తున్నప్పటికీ రాజ్యాంగంలో మొదటపేజీ పీఠికలో రాసుకున్న స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వం, ముఖ్య ఉద్దేశం ప్రతి పౌరునికి తెలుసుకోవలసిన, తెలియజెప్పాల్సిన అవసరం ఉందని, రాజ్యాంగాన్ని తెలుగులో ముద్రించాలని ఆర్.పి.ఐ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు అంజయ్య డిమాండ్ చేశారు.

తిరుపతి సిటీ: నేటి సమాజంలోని ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగం పట్ల అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం వుందని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు పేర్కొన్నారు. తిరుపతిలోని ఎపిఎస్ పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్, ఫైనాన్స్(ఎఫ్ఎసి) వై లక్ష్మీ నరసయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు డిఎస్ వరకుమార్, కె. ఆదిశేషయ్య, పి.హెచ్. జానకిరామ్, జనరల్ మేనేజర్లు వెంకటరాజు, ప్రసాద్, రామచంద్ర రావు, మురళి, సురేంద్రరావు, నాయకులు జయరామ్, సుబ్రమణ్యం, జనార్ధన్ పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కార్వేటినగరం రోడ్డులోని అంబేద్కరు విగ్రహానికి జిల్లా మాజీ జడ్జి దొరస్వామి, అంబేద్కర్ ట్రస్ట్ సభ్యులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ట్రస్ట్ నాయకులు డాక్టర్ రాజేంద్ర , హెడ్మాస్టర్ చంద్ర, బాలసుబ్రహ్మణ్యం, కిరణ్ కుమార్ మహేష్ రాజేంద్ర , నాగేంద్ర గుణశేఖర్, ప్రభాకర్ , ఏలుమలై, బాబు, ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

పుత్తూరు కోర్టు ఆవరణలో పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర న్యాయవాదులతో కలిసి సోమవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ జానకి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి గోపాలకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కే పురుషోత్తం. న్యాయవాదులు. కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: రాజ్యాంగ దినోత్సవాన్ని మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాల, బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య, కళ్లివెట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్ అధ్యక్షతన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు నాదెండ్ల మురళి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, వేణుగోపాల్, సురేష్ బాబు, ఒబ్బుదేవి ప్రసాద్, దాసు, మాధవీలత , దేవేంద్ర, లక్ష్మయ్య, జగన్నాధం పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు: ఎంపిడిఓ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నాయకులు ఆర్వి రమణారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో సతీష్ కుమార్, ఈఓఆర్డి సోమశేఖర్ రెడ్డి, ఎంఈఓ గోపి, సిబ్బంది విజయ కుమార్, నాగేశ్వర రెడ్డి, సతీష్, వినోద్, ఎంసీఓ గిరిబాబు, అటెండర్లు శ్రీరాములు, యుగేష్, శైలజ పాల్గొన్నారు.

గూడూరు టౌన్: గూడూరు కోర్టు కాంప్లెక్స్ ఆవరణలో ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళ వారం ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ పీఠికను సిబ్బంది ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి బి రాజేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ బివి సులోచన రాణి, అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ లోకనాథం, సెకండ్' క్లాస్ మెజిస్ట్రేట్ శంకరయ్య, ఏవో పద్మావతి, నయోమి, ఏపీపీ లక్ష్మణ్ నారాయణ, అడ్వకేట్లు అరవ పార్వతయ్య, మహబూబ్ బాషా, పెంచలయ్య పాల్గొన్నారు.

స్థానిక ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం ప్రిన్సిపాల్ కే శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజ్యాంగ ప్రవేశికను పఠించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై శ్రీనివాసులు, రవిరాజు , అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, కంప్యూటర్ అధ్యాపకులు మైమూన్, లక్ష్మి , పాల్గొన్నారు.

రామచంద్రపురం: రాజ్యాంగ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలి, రాజ్యాంగ నిబంధనల మేరకు ప్రజా సేవకులుగా మనమందరం బాధ్యతగా పేద ప్రజలకు సేవలు అందించాలని తహశీల్దారు కే వెంకటరమణ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గాంధీ, బిఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ పీఠికను చదివించి ఎంపీడీవో ఇందిరా ప్రతిజ్ఞ చేయించారు. విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఎంతో మహోన్నతమైందని కొనియాడారు.

పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని ఎంపిడివో కార్యాలయంలో ఎంపీడీవో ప్రమీల రాణి ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యాలయ సిబ్బంది , ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి బీఎస్పీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు డివి కృష్ణయ్య, కలికిరి సుబ్రహ్మణ్యం, న్యాయవాది రౌతు నరసయ్య, బామ్ సెఫ్ నాయకులు బందిలి శ్రీనివాసులు, దారా శేషయ్య, తీపలపూడి నాగరాజు పాల్గొన్నారు.

కోట : కోట మండలంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో కోట పట్టణంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోట క్రాస్ రోడ్డు నుండి అంబేద్కర్ బొమ్మ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ


పుత్తూరు కోర్టులో

కార్యక్రమంలో హేమంత్, కేశవులు, మీజూరు చంద్ర, చిరంజీవి, భూపతి మోహన్ సాయి, ఏడుకొండలు, వెంకటరమణయ్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

తిరుపతి డెస్క్: నాగలాపురం మండలంలోని మేజర్ పంచాయతి కార్యాలయంలో సర్పంచ్ చిన్నదొరైసుధా అధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సునీత హరిబాబు, ఎంపిటిసి రాజ, వార్డు మెంబరు ఉదయ్ కుమార్, టియుసి చైర్మెన్ ఏలుమలై, నాయకులు దేశన్, సన్, గజేంద్రన్ కార్యకర్తలు, పాల్గొన్నారు.

తిరుపతి(మంగళం): కాంగ్రెస్ పార్టీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు బాలగురవం బాబు ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, సుప్రజ, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐరాల లోకేష్ రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు స్వరూప్ నాయక్, చిరంజీవి, మల్లికార్జున, తలారి గోపి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

క్యాంపస్ : ఎస్వీయూలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎస్వియూ విసి ఆచార్య సిహెచ్ అప్పారావు ఘనంగా నివాళులర్పించారు. భారతీయుల్లో ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, వర్సిటీ ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహులు, ఆచార్య సుధాకర్ బాబు, వర్సిటీ ఇంజనీర్ తాండవ కృష్ణ, వర్సిటీ ఎస్సీ, ఎస్టీ విద్యార్థి పరిశోధకుల సంఘం అధ్యక్షుడు బివిఎఫ్ మురళి పాల్గొన్నారు.

తడ: తడ మండలంలోని కాశీం గాడు కుప్పంలో ఎంపీయుపి స్కూల్ లో జాతీయ రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రఘురామయ్య ఉపాధ్యాయులు కరీముల్లా, పద్మజారాణి, సుధాకర్, సుబ్రమణ్యం, తిరుపతి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

నకిలీ ప్రెస్టీజ్' మిక్సీ గ్రైండర్లు స్వాధీనం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ప్రముఖ కిచెన్ అప్లయన్స్ బ్రాండ్ టీటీకే ప్రెస్టీజ్ లిమిటెడ్ నకిలీ 'ప్రెస్టీజ్' ఉత్పత్తుల విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంది. ప్రెస్టీజ్ బ్రాండ్ పేరుతో నకిలీ మిక్సీ గ్రైండర్లు విక్రయాలు జరుపుతున్నట్లు గుర్తించింది. తిరుపతి బజార్ వీధిలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ బజారులో పెద్ద ఎత్తున నకిలీ ప్రెస్టీజ్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఆర్కే ఏజెన్సీస్ వద్ద 600 నకిలీ సేఫ్టీ వాల్వులు, ఒక నకిలీ మిక్సీ గ్రైండర్ జార్, శ్రావ్య శ్రీ సర్వీస్ సెంటర్ వద్ద 12 నకిలీ సేఫ్టీ వాల్వులు, రెండు నకిలీ మిక్సీ గ్రైండర్ జార్లు, కష్ణా ఎంటర్‌ప్రైజెస్ వద్ద ఏడు నకిలీ మిక్సీ గ్రైండర్ జార్లు, ఎస్వీ పద్మావతి ఎంటర్‌ప్రైజెస్ వద్ద 35 నకిలీ డీలక్స్ విసిల్స్, 32 నకిలీ పాపులర్ విసిల్స్, 158 నకిలీ సేఫ్టీ వాల్వులను స్వాధీనం చేసుకున్నారు. కాపీహక్కు చట్టం 1957 సెక్షన్ 63, 65 కింద తిరుపతి పోలీస్ స్టేషన్‌లో నమోదు చేశారు. ఎంఎస్ ఆర్కే ఏజెన్సీస్ యజమాని రాజేష్, శ్రావ్య సర్వీస్ సెంటర్ యజమాని హరి, కష్ణ ఎంటర్‌ప్రైజెస్ యజమాని కష్ణారెడ్డి, ఎస్ వీ పద్మావతి ఎంటర్‌ప్రైజెస్ యజమాని భార్గవి, ఎంఎస్ ఎస్కే ట్రేడర్స్ యజమాని కేదార్‌నాథ్ లను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా టీటీకే ప్రెస్టీజ్ ప్రతినిధి మాట్లాడుతూ నకిలీ ఉత్పత్తుల విక్రయంతో వినియోగదారులను మోసం చేయడంతో పాటు కంపెనీ గౌరవానికి భంగం కలిగిస్తున్నారని తెలిపారు. టీటీకే ప్రెస్టీజ్ వినియోగదారులు అధికారిక డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. తప్పనిసరిగా రశీదును తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అంకమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి -కోట: కోట మండలం శ్యామ సుందర పురంలోని అంకమ్మ ఆలయంలో మంగళ వారం అన్నదానం నిర్వాహించారు. ఈ సందర్భంగా ఈ దేవాలయంలో ప్రతి మంగళవారం మధ్యాహ్నం అన్నదానం నిర్వహిస్తామని అంకమ్మ దేవస్థానం నిర్వాహకులు గూడపాకల సుబ్బారావు తెలిపారు. అంతేకాకుండా దశలవారీగా ఆలయం పనులు చేపడుతామని తెలిపారు. దేవాలయం చుట్టూ టెంకాయ, మామిడి, సపోటా, తదితర మొక్కలు నాటారు. దేవాలయం ముందు భాగంలో త్వరలో అన్నదానం నిర్వహణకు రేకుల షెడ్ నిర్మిస్తామని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంపులూరు బాబురావు, భక్తులు ఉన్నారు.


ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

ధర్నాకు తరలిన సీఐటీయూ నాయకులు



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : తిరుపతిలో నిర్వహించిన ధర్నాకు గూడూరు సీఐటీయూ నాయకులు వాహనంలో మంగళ వారం బయలు దేరి వెళ్లారు. సీఐటీయూ సీనియర్ నాయకులు పామంజి మని జెండా ఊపి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 నవంబర్ 26 నుంచి 28 వరకు దేశవ్యాప్తంగా మహా ధర్నాలు నిర్వహించిందన్నారు. 13 నెలలు పోరాడి చట్టాలను రద్దు చేయించిన అనుభవంతో డిమాండ్ల సాధనకు పోరాటానికి సిద్ధమైందన్నారు. రాబోయే మూడు నెలల్లో తమ న్యాయమైన డిమాండ్లను ఆమోదించకపోతే సుదీర్ఘ పోరాటానికి సిద్ధమవుతామన్నారు. అందుకు సన్నాహంగా నవంబర్ 26న దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలకు పిలుపు నిచ్చింది. కార్మికులు, కర్షకులే కాకుండా వ్యవసాయ కార్మికులు, గిరిజను లు, వృత్తిదారులు, మహిళలు, విద్యార్థులు, యువకులు వినియోగదారులందర్నీ కదిలించటం ద్వారా కేంద్రానికి హెచ్చరిక పంపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ ధర్నాకి గూడూరు నుండి 20 మందికి పైగా సిఐటియూ నాయకులు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శ్రీనివాస్ , సురేష్ , బివి రమణయ్య , అడపాల ప్రసాద్ పాల్గొన్నారు.

తిరుమల బస్ సర్వీసు ప్రారంభం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ఆర్‌టిసి డిపోలో తిరుమలకు వెళ్లే నూతన బస్సు సర్వీసును ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ మంగళవారం రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపితోనే అభివృద్ధి సాధ్యమని, ఇటీవల రవాణా శాఖ మంత్రిని కలిసి తిరుమలకు బస్సులు ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందించామని తెలిపారు. ఈ నేపథ్యంలో తిరుపతికి నూతన బస్సు సర్వీసును ప్రారంభించారన్నారు. త్వరలో మరో రెండు బస్సులు ప్రారంభిస్తారన్నారు. సంక్రాంతి కల్లా రాష్ట్రంలో 14 వందల ఆర్‌టిసి బస్సు సర్వీసులు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు శీలం కిరణ్ కుమార్, బిల్లు చెంచురామయ్య, రహీం, జగన్‌మోహన్ రెడ్డి, ఆర్‌టిసి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై గ్రీవెన్స్ సెల్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు సబ్ డివిజన్ పరిధిలోని నాగలాపురం సబ్ డివిజన్లోని విద్యుత్ సమస్యలు పరిష్కారానికి పుత్తూరు డిఈ కార్యాలయంలో , పుత్తూరు సబ్ డివిజన్ విద్యుత్ సమస్యలు మాత్రమే పుత్తూరు ఏడీ ఆఫీస్‌లో బుధవారం విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చునని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దేవా ఆశీర్వాదం , పుత్తూరు డిఈఈఈ శంకరయ్య, నాగలాపురం డి.ఈ.ఈ. రమేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో రోడ్డు భద్రత నిబంధ నలపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గూడూరు ఆర్‌టిఓ బిఎస్‌కె కిషోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ ట్రిపుల్ రైడింగ్‌కు దూరంగా ఉండాలనీ, రాష్ , నిర్లక్ష్య డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. పాదచారులు భద్రతను దృష్టిలో ఉంచుకుని, నెమ్మదిగా, జాగ్రత్తగా డ్రైవ్ చేయాలని తెలిపారు. ద్విచక్ర వాహనాలు నడపడానికి హెల్మెట్ ధరించడం తప్పనిసరి, ఇది భద్రతలో ముఖ్యమైన భాగం, తీవ్రమైన గాయాలను నివారించడంలో సహాయ పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ ప్రభాకర్, కళాశాల ప్రిన్సిపాల్ రవి ప్రసాద్ , డైరెక్టర్ దత్తాత్రేయ శర్మ , కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి కోటేశ్వరరావు, కొండారెడ్డి, అధ్యాపక అధ్యాపకేతర బృందం , వాలంటీర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట సాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: 'పొలం పిలుస్తోంది' నిర్వహణలో భాగంగా వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖ అధికారులు నారాయణవనం మండల పరిధిలోని ఉత్తర పాలమంగళం గ్రామ సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ, క్షేత్ర సందర్శనలు నిర్వహించారు. వ్యవసాయ అధికారి యస్ శోభారాణి మాట్లాడుతూ ఈనెల 26, 27, 28 వ తేదీలలో వర్షాలు పడే సూచనలు ఉన్నాయని తగు సమయం చూసి వేరుశనగ విత్తనాలను జాగ్రత్త పరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాయి రవి, గ్రామ వ్యవసాయ సహాయకులు ఇ దివ్య, వెటర్నరీ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం : వేటగిరిపాలెం, మోదుగులపాలెం,గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది సమావేశాన్ని నిర్వహించారు. .మండల వ్యవసాయ అధికారి జ్యోతిర్మయి ఆర్‌ఎస్‌కే సిబ్బంది యుగంధర్,ఆ గ్రామాల రైతులు పాల్గొన్నారు. వరి పంట సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

'మాదక ద్రవ్యాలతో భవిష్యత్ నాశనం చేసుకోవద్దు'

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మాదక ద్రవ్యాలతో భవిష్యత్ నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సిఐ కరీమా బేగం పేర్కొన్నారు. గూడూరు శ్రీ స్వర్ణాంధ్ర భారతి జూనియర్ కళాశాల, ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు బాలకృష్ణ , శేషమ్మ , వేణుగోపాల్, సుబ్బయ్య పాల్గొన్నారు.

రోడ్లలో గుంతలను పూడ్చండి : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి నగరంలోని ప్రధాన వీధులు, సందుల్లోని రోడ్లలో ఎక్కడా గుంతలు లేకుండా పూడ్చాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం నగరంలోని అన్నమయ్య కూడలి, రైతు బజారు, ఎమ్మార్ పల్లి, పోలీసు స్టేషన్ రోడ్డు, ఆర్.సి.రోడ్డు, తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను, రోడ్లపై ఉన్న గుంతలను ఇంజినీరింగ్, హెల్త్ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. అనంతరం ఈ.ఎస్.ఐ.వద్ద అన్నా క్యాంటీన్ ను కమిషనర్ పరిశీలించారు.


ఎస్వియూ క్యాంటీన్‌లో ధరలు పట్టిక ప్రదర్శించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయూ క్యాంటీన్లో ధరల పట్టిన ప్రదర్శించి, నాణ్యమైన వస్తువులను వర్సిటీ నిర్ణయించిన ధరల ప్రకారం అమ్మాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నేతలు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వర్సిటీలో క్యాంటీన్ టెండర్లను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు వర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడు కి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్. అక్బర్ లు మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీలో దాదాపు ఐదువేల మంది పైగా విద్యార్థులు ఉన్న వర్సిటీలో అన్నపూర్ణ క్యాంటీన్ మూసివేసి, సంపూర్ణ కాంటీన్ మాత్రమే నడుస్తుందని ఆరోపించారు. వర్సిటీలో రెండు క్యాంటీన్లు టెండర్ల ప్రకారం ఒకరికే అప్పగించడం వర్సిటీ నిబంధనలకు విరుద్ధమన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన రిజిస్ట్రార్ మాట్లాడుతూ క్యాంటీన్ల విషయంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఆఫీస్ బేరర్స్ అశోక్,వినోద్, నరేంద్ర, సుస్మిత నాయకులు వీరేష్, మధు, శ్రీరాం పాల్గొన్నారు.

లోకేష్ ను కలిసిన రంగినేని

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :

రాష్ట్ర మంత్రి లోకేష్ బాబును శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు విజయవాడలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ముక్కంటి తీర్థ ప్రసాదాలు అందించారు. చెంచయ్య నాయుడు గత కొంతకాలంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డిని వెంటపెట్టుకుని సీఎం చంద్రబాబు మొదలుకొని ముఖ్యమైన నాయకులందరినీ కలుస్తున్నారు. త్వరలో ముక్కంటి ట్రస్ట్ బోర్డును ప్రకటించనున్న నేపథ్యంలో ఆయన వరుసగా ముఖ్య నేతలను కలుస్తున్నటుగా తెలుస్తోంది. చెంచయ్య ట్రస్ట్ బోర్డు చైర్మన్ రేసులో ఉన్నారు.


మంత్రి లోకేష్‌ను కలిసిన గంగినేని చెంచయ్యనాయుడు

ఇంజనీరింగ్ కళాశాలలో సీనియర్ పై జూనియర్లు దాడి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయూ ఇంజనీరింగ్ కళాశాలలో సీనియర్ విద్యార్థులు కొందరు జూనియర్ల విద్యార్థులను రెస్పెక్ట్ ఇచ్చి మాట్లాడాలని, 'గౌరవించాలని సూచిస్తే ... మీరెవరో మాకు చెప్పడానికి ' అని జూనియర్ విద్యార్థులు అవహేళన చేస్తూ దాడి చేశారు. సాధారణంగా జూనియర్, సీనియర్ విద్యార్థులు ఒకరికొకరు అన్యోన్యంగా మర్యాద ఇచ్చి పుచ్చుకుంటూ చదువులు కొనసాగిస్తుంటారు అయితే ఎస్వీయూ ఇంజనీరింగ్ కళాశాలలో జూనియర్ విద్యార్థులు కొంతమంది విద్యార్థి సంఘం నేతల అండదండలతో సీనియర్ విద్యార్థులపై రెచ్చిపోయి దాడులకు దిగారు. దిక్కుతోచని సీనియర్ విద్యార్థులు పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించారు. జూనియర్ విద్యార్థులు ఇలా చేయడం, దుర్భాషలాడడం సమంజసమేనా ఇదేంటని ప్రశ్నిస్తే పోలీస్ స్టేషన్ దగ్గర కూడా కొడతామని దాడికి ప్రయత్నించడం విడ్డూరం. వర్సిటీలో పలు రకాల తగాదాలకు విద్యార్థి సంఘాల నేతలు ఆజ్యం పోస్తున్నారని సమాచారం. ఉన్నతాధికారులు వివిధ కళాశాలలపై పర్యవేక్షణ చేస్తూ, కఠినమైన చర్యలకు తీసుకుంటే కానీ విద్యార్థులు దారికి వచ్చే పరిస్థితి లేదు.

'బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయండి'

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో గత ఐదు సంవత్సరాలకు పైబడి పని చేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లు 2019 నోటిఫికేషన్లు యూజీసీ నియమ, నిబంధన ప్రకారం ఐదుగురు సభ్యుల కమిటీ ద్వారా ఎన్నికయ్యారని ఇందులో ఎక్కువ మంది బడుగు, బలహీన వర్గాలకు చెందినవారు ఉన్నారని వారికి న్యాయం చేయాలని ఏపీ దళిత, కాపు, బీసీ సంఘం అధ్యక్షులు డాక్టర్ సుంగలూరు శివకాపు డిమాండ్ చేశారు. మంగళవారం వర్సిటీ రిజిస్ట్రార్ కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షులు జయరామయ్య, సెక్రెటరీ నరేంద్ర, సభ్యులు పాల్గొన్నారు.

ఫియోనా రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ బ్రాండ్ అంబాసిడర్‌గా నటి కీర్తి సురేష్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్:

బంగే ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఎడిబుల్ ఆయిల్స్ మార్కెట్‌లో అగ్రగామి, వంట నూనెల్లో అత్యుత్తమ ఎంపిక అయిన ఫియోనా రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ నటి కీర్తి సురేష్‌ను ఎంపిక చేయడం జరిగిందని బంగే ఇండియా ప్రెసిడెంట్ అండ్ బిజినెస్ హెడ్, వినయ్ శ్రీవాస్తవ ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె అంబాసిడర్‌గా రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆమె అద్భుతమైన నటనతో దక్షిణ భారతదేశపు ప్రేక్షకులతో లోతైన అనుబంధాన్ని కలిగివుందని, భారతీయ గృహాలకు నాణ్యత, పోషణ, రుచిని మిళితం చేసే విశ్వసనీయ వంట నూనెను అందించడానికి ఫియోనా మిషన్‌కు కీర్తి ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. రోజువారీ వంటకాలు రుచికరమైనవి మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైనవిగా ఉంటాయి.

చంద్రగిరిని చెన్నపట్నం చేస్తా..

ప్రజలు, వ్యాపారుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): 'అభివృద్ధికి నోచుకోని చంద్రగిరిని చెన్నపట్నంలా అభివృద్ధి చేస్తా..' అంటూ రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) కోరారు. స్థానిక ఎమ్మెస్సార్ కళ్యాణ మండపంలో జాతీయ రహదారి నుండి మంగాపురం వరకు రోడ్డు అభివృద్ధిపై చంద్రగిరి స్థానికులు, వ్యాపారులతో ఆత్మీయ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల పాలకులు చంద్రగిరిని అభివృద్ధి చేస్తానని మాయమాటలు చెప్పి ప్రజలను మోసగించారన్నారు. చంద్రగిరిలో గోవింద ధామం, రోడ్ వైడింగ్, మినీ బస్సు డిపో, నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం సాఫ్ట్‌వేర్‌కంపెనీ, పురాతన బ్రహంగారి దేవాలయ కోనేరుతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు స్థానికులకు ఎమ్మెల్యే వివరించారు. చంద్రగిరి నాగాలమ్మ గుడి నుండి మంగాపురం వరకు రోడ్డు వైడింగ్ కు స్థలాన్ని ఎవరికి ఇబ్బందులు లేకుండా ఇరు వైపులా సమానంగా తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. చిన్న, మధ్యతరగతి వ్యాపారులకు నష్టం కలగకుండా న్యాయం చేస్తాం తెలిపారు. చంద్రగిరిలో శ్రీకృష్ణదేవరాయల కోటను అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానన్నారు. చంద్రగిరిలో మినీ ఆడిటోరియం ఏర్పాటు చేస్తామ న్నారు. అభివృద్ధి పనులపై స్థాని కులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, మేధావు లు అందరూ సహకరిస్తామని పేర్కొంటూ ఎమ్మెల్యే పులివర్తి నానికి ఆత్మీయ సమావేశంలో జై కొట్టారు. శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయం లో చెప్పినట్లు పులివర్తి నాని అందరివాడు. ఎవరికి ఏ అవసరమైనా నా దృష్టికి తీసుకురండి సమస్యను పరిష్కరిస్తానని, సహకరించిన రైతులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆత్మీయ సమావేశంలో వి సుబ్రహ్మణ్యం నాయుడు, ముడిపల్లి సురేష్ రెడ్డి, ఆర్ మునిరత్నం రాయల్, చేగు లక్ష్మీనారాయణ, చేగు గోవర్ధన్ గుప్తా, జెడ్పిటిసి యుగంధర్ రెడ్డి, డాక్టర్ కె వి ఎస్ వాసు, వి రమేష్ రెడ్డి, అయ్యప్ప, రాజుల గారి మధుసూదన్ రెడ్డి, జగదీష్ రాయల్, ఎస్ గౌస్ బాషా, సక్కూరి ధనంజయ రెడ్డి, వ్యాపారస్తులు, స్థానిక ప్రజలు, మహిళలు, విశ్రాంత ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు భారీగా పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

ఘనంగా ముగిసిన బేస్ బాల్ పోటీలు

విజేతలుగా ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలబాలికల జట్లు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 68వ అంతర్రాష్ట్ర అండర్ 14 బేస్ బాల్ పోటీలు మంగళం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళం ట్రెండ్స్ లో మంగళవారం ఘనంగా ముగిశాయి. మూడు రోజులపాటు ఉమ్మడి 13 జిల్లాల నుండి వచ్చిన బాల బాలికల జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఈ పోటీలలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన బాల బాలికల జట్లు విజేతలుగా నిలిచి డిసెంబర్‌లో ఛత్తీస్‌ఘడ్‌లో నిర్వహించే జాతీయ పోటీలలో పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవులు నాయుడు, ఎస్జిఎఫ్ సెక్రటరీ బాబు తెలిపారు. మంగళవారం ముగింపు కార్యక్రమానికి టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి మబ్బు దేవనారాయణ రెడ్డి, అమిగోస్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ ఎండి అనిత్ కుమార్ రెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఆడే క్రీడల నుండి విద్యార్థి మానసిక, శారీరక దృఢత్వాన్ని పొందగలుగుతారన్నారు. విద్యతో సమానంగా క్రీడలను నేర్చుకుంటే ఉజ్వల భవిష్యత్తు కు బాటలు వేస్తాయని విద్యార్థులకు సూచించారు. విజేతలకు బహుమతులను బిసిఎం పాఠశాల కరస్పాండెంట్ అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ షేక్ భాను, ఉపాధ్యాయులు కృష్ణమనాయుడు, విజయసింహారెడ్డి, చంద్రశేఖరయ్య, రామి నాయుడు, గిరీశం రాఘవేంద్ర, కిట్టన్న, లావణ్య దుర్గవాయి, విజయలక్ష్మి, నీరజ లక్ష్మీకాంతం, హిమబిందు శైలజ పాల్గొన్నారు.

బాలుర జట్లలో మొదటి స్థానంలో చిత్తూరు, రెండవ స్థానంలో విజయనగరం, మూడవ స్థానంలో కడప జిల్లా, బాలికల జట్లలో మొదటి స్థానంలో చిత్తూరు, రెండవ స్థానంలో శ్రీకాకుళం, మూడవ స్థానంలో వైయస్సార్ కడప జిల్లాల జట్లు నిలిచాయని పాఠశాల పీడీ రామకృష్ణ తెలిపారు. బాలుర జట్టులో జాతీయ స్థాయికి నవీన్ కుమార్, కార్తీక్, అజిత్, పవన్,జోయల్, మోహన్ కృష్ణ బి సంతోష్,ఎం సంతోష్, కైఫ్, జస్వంత్, తులసి రాజ్, లోహిత్, వంశీ, చైతన్య, వంశీ, బాలికల జట్టులో జాతీయ స్థాయికి రమ్య, శ్రీ భవ్య, శ్రీ హిమజ నిరోషా, వినయ లక్ష్మి, హరిణి, జీవిత, తనుజ, వైష్ణవి, మౌనిక గాయత్రి, భూమి, హేమ, లావణ్య, అక్షయ,దీక్షిత ఎంపికయ్యారని ఎస్జిఎఫ్ నిర్వాహకులు తెలిపారు.



ఉచిత ఇసుకను పక్కాగా అమలు చేయాలి: తహశీల్దారు

ప్రజాశక్తి-రామచంద్రపురం: రాజ్యాంగ దినోత్సవాన్ని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. అనంతరం ఎంపిడివో ఇందిర, తహశీల్దారు కె వెంకటరమణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు కె వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాలలో పేద ప్రజల ఇంటి నిర్మాణానికి నూతన ఉచిత ఇసుక పాలసీ అమలు పక్కాగా ఉండేలా ప్రతి ఒక్కరూ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంటి నిర్మాణానికి ఇసుక అవసరమైన వారు గ్రామస్థాయిలో సచివాలయాలలో డిజిటల్ అసిస్టెంట్ ద్వారా రసీదును పొంది ఇసుకను ఉచితంగా తీసుకు వెళ్లవచ్చన్నారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్ జియో ట్యాగింగ్ నవంబర్ 30 నాటికి పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ నెల 26,27,28వ తేదీ తుపాను హెచ్చరిక నేపథ్యంలో అధికారులు అన్ని వేళలా అప్రమత్తంగా వుండి ప్రజలకు సేవలు అందించాలని ఆదేశించారు.

7న ఎంపీటీ సమావేశం

ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి మార్కండేయ నాయుడు మాట్లాడుతూ 'బడి వైపు ఒక అడుగు - తల్లి దండ్రులతో ముచ్చట్లు' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య బంధాన్ని బలోపేతం చేయడంలో భాగంగా మెగా పేరెంట్ టీచర్ సమావేశాలను డిసెంబర్ 7వ తేదీ పండుగ వాతావరణంలో ప్రతి పాఠశాలలో నిర్వహించాలన్నారు. ఎంఈఓ -2 జయవేలు మాట్లాడుతూ ఈ సమావేశంలో బోధన విధానం, పర్యవేక్షణ గురించి విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండేలా చర్యలు చేపట్టి, ప్రతి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల, హాస్టల్ విద్యార్థికి అసెస్మెంట్ కార్డులు అందిస్తామని పేర్కొన్నారు. ఎంపీటీ సమావేశంలో మధ్యాహ్న భోజనం పథకం ద్వారా అందించే మెనూ ప్రకారం ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అందరూ కలిసి భోజనం చేయాలన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల గురించి సమావేశంలో సమీక్షించి పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మండల అధికారులు


ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని అసెంబ్లీలో స్పీకర్‌ని కోరిన ఎమ్మెల్యే సునీల్ కుమార్‌ను అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో మంగళవారం వాకర్స్ హెల్త్ క్లబ్ , అన్ని రంగాల క్రీడాకారులు ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో నాలుగు సిమెంట్ బెంచీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్ సహకారంతో గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని చెప్పారన్నారు. వాకర్స్ విశ్రాంతి కోసం నూతన బెంచీ లను బహూకరించిన రత్నాకర్ రెడ్డి, ప్రభాకర్ రావు, బాలయ్య, రాఘవులును అభినందించారు. స్టేడియంకి అవసరమైన అన్ని వసతులు సమకూరుస్తానని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సిమెంట్ రోడ్లు ఫ్లైఓవర్ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, వసంత్ కుమార్, శర్మ, వేమా వెంకటేశ్వర్లు, రత్నాకర్ రెడ్డి, బొడ్డు కృష్ణయ్య, సురేష్, విజయ్ క్రీడాకారులు కోటేశ్వరరావు, పురుషోత్తం, మస్తాన్, మునీఫ్, సందీప్, లవకుమార్, రజనీ, దీపక్, వ్యాయామ ఉపాధ్యాయులు రాజా, ఇతర క్రీడాకారులు వాకర్స్ అందరూ పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న వాకర్స్ హెల్త్ క్లబ్ సభ్యులు

మంత్రి అనగానికి జనసేన స్వాగతం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్ కు స్థానిక రేణిగుంట విమానాశ్రయం వద్ద జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత కోటా, కోటా చంద్రబాబు మంగళవారం స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సత్కరించారు. అనంతరం శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై మంత్రికి వివరించారు.



ఆచార్యులకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయూలో యుజిసి మార్గదర్శకాల ప్రకారం సిఎఎస్ ద్వారా ఉద్యోగోన్నతులు కల్పించాలని ఏబిఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య వైవి రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఎస్వీయూ ఇన్చార్జ్ విసి ఆచార్య సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ యం.భూపతినాయుడుని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీ సిఎఎస్ ప్రమోషన్లకై విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం యూజీసీ 2018 నియమ నిబంధన ప్రకారం ఎస్వీయూలో పనిచేస్తున్న ప్రొఫెసర్ల కుసీనియర్ ఆచార్యులుగా పదోన్నతి కల్పించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న ప్రొఫెసర్లకు యూజీసీ నియమ నిబంధనల ప్రకారం సీనియర్ ప్రొఫెసర్లుగా ఉద్యోగోన్నతులు కెరియర్ అడ్వాన్స్ స్కీమ్ కింద కల్పిస్తున్నారని, ఎస్వీయూలో కూడా అర్హత ఉన్న ప్రొఫెసర్లు అందరికీ సీనియర్ ప్రొఫెసర్లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. వర్సిటీలో పనిచేస్తున్న అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగులందరికీ నవంబర్ నెల జీతాలు ఇంతవరకు రాలేదని, వెంటనే జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉపకులపతి ప్రొఫెసర్ అప్పారావు మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమములో ఆ సంఘం ప్రతినిధులు ఆచార్య రాజశేఖర్, ఆచార్య బాలాజీ, ఆచార్య జయచంద్ర రెడ్డి, ఆచార్య రంజని, డాక్టర్ రమేష్‌లు పాల్గొన్నారు



చట్టం అందరికీ సమానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: చట్టం అందరికీ సమానంగా అందాలని 12వ అదనపు జిల్లా జడ్జ్ శ్రీనివాస్ నాయక్ సూచించారు. స్థానిక కోర్రు ఆవరణలో మంగళవారం జాతీయ చట్ట దినోత్సవం, వరకట్న వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. వరకట్న చట్టాలు చాలా కఠినంగా ఉంటాయనీ, ఉచిత న్యాయం బాధితులకు అందేలా న్యాయవాదులు కృషి చేయాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి తదితరులు పాల్గొన్నారు.



ట్రావెల్ బస్సు ఢీ
ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొని ఆరుగురు పల్నాడు జిల్లా వాసులు గాయపడ్డ ఘటన మంగళవారం మదనపల్లి–నాయుడుపేట జాతీయ రహదారి వంతెనపై జ్ఞానాంబ కండ్రిగ సమీపంలో చోటు చేసుకుంది. టూ టౌన్ సీఐ వెంకటేశులు కథనం మేరకు పల్నాడు జిల్లా రెంటచింతల మండలం మల్లవరం గ్రామానికి చెందిన శీనునాయక్ కుటుంబ సభ్యులతో కలిసి తుఫాన్ వాహనంలో తిరుమలకు బయలుదేరాడు. ఈ క్రమంలో బెంగళూరు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు జ్ఞానాంబకండ్రిగ వద్ద అదుపు తప్పి తుఫాన్ వాహనంను ఎదురుగా ఢీ కొట్టింది. దీంతో ముందు భాగం నుజ్జునుజ్జు కాగా తుపాను వాహనంలోని శీనునాయక్ కుటుంబీకులు ఆరుగురు గాయపడ్డారు. వీరిలో సుజాత, సోమలనాయక్, ఆంజనేయులు, నవీన్ లకు తీవ్ర గాయాలు కావడంతో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి నుంచి తిరుపతి రుయాకు తరలించారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు..

విద్యార్థులలో విద్య నైపుణ్యతను పెంపొందించండి

- రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు

ప్రజాశక్తి -రామచంద్రపురం : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులలో విజ్ఞానాభివృద్ధి, నైపుణ్యతలను పెంపొందిం చాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ రామరాజు అన్నారు. మంగళవారం రాత్రి మండలం లోని సి రామాపురంలోని సైనిక్ స్కూల్ ఆవరణంలో ఎఫ్ఎల్ఎన్ ప్రాంతీయ శిక్షణ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ) శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జాతీయ నూతన విద్యా విధానం2020 ని పాఠశాలలో పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ఈ శిక్షణా తరగతుల వల్ల ఉపాధ్యా యులు ప్రతి ఒక్కరూ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించు కోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. తిరుపతి, నెల్లూరు, అన్నమయ్య జిల్లాలకు చెందిన హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులకు ఆరు రోజులపాటు రెసిడెన్షియల్ ట్రైనింగ్ ప్రోగ్రాం ను ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో 30వ తేదీ వరకు రిసోర్స్ పర్సన్స్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు కడప పాఠశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్ తెలిపారు ఈ శిక్షణలో స్కూల్ లీడర్షిప్, నిధుల వినియోగం, రికార్డుల నిర్వహణ, విద్య, మెరుగైన విద్యా బోధన వంటి అంశాలపై శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఉపాధ్యాయులు పాఠశాలల్లో అమలు చేసేలా చూడాలన్నారు.. ఉపాధ్యాయులు నాయకత్వ లక్షణాలను పాటిస్తూ విద్యార్థుల్లోనూ క్రమశిక్షణ పెంపొందింప చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్, ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ, ఎంఈఓ మార్కండేయ నాయుడు, జయ వేలు, సర్వ శిక్ష అభియాన్ అధికారులు పాల్గొన్నారు.





ఘనంగా జాతీయ పాల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఇండియన్ డెయిరీ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ (ఐడిఏ–ఏపి)స్థానిక చాప్టర్, కాలేజ్ ఆఫ్ డెయిరీ టెక్నాలజీ, శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ సంయుక్తంగా తిరుపతిలోని కాలేజ్ ఆఫ్ డెయిరీ టెక్నాలజీలో భారతదేశం మిల్క్ మ్యాన్ గా ప్రసిద్ధి చెందిన డాక్టర్ వర్గీస్ కురియన్ జన్మదినాన్ని పురస్కరించుకుని జాతీయ పాల దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు డాక్టర్ వర్గీస్ కురియన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వివిధ వక్తలు మాట్లాడుతూ భారతదేశంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి, గ్రామీణ పాల ఉత్పత్తిదారులకు ముఖ్యంగా మహిళలకు సాధికారత కోసం డాక్టర్ వర్గీస్ కురియన్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. సహకార సంఘాలకు డా, వర్గీస్ కురియన్ సహకారం.. 'రైతులు, గ్రామీణ మహిళలకు సాధికారత' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు, విజేతలకు సర్టిఫికెట్లు, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఐడిఏ–ఏపి చాప్టర్ ఆన్లైన్ క్విజ్ను కూడా నిర్వహించింది, 400 మందికి పైగా అభ్యర్థులు ఆన్లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐడిఏ ఏపి లోకల్ చాప్టర్ ద్వారా 2024 సంవత్సరానికి గాను ఆంధ్రప్రదేశ్ ఉత్తమ పాడి రైతుగా ఎంపికైన చిత్తూరు జిల్లా మద్దిరాల వెంకటగిరి కోట గ్రామానికి చెందిన పనమారెడ్డిగారి నవీనా కుమారిని సత్కరించి ప్రశంసాపత్రం, నగదు బహుమతిని కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో డెయిరీ సైన్స్ ఫ్యాకల్టీ డీన్ డాక్టర్ కె. నాగేశ్వరరావు, ఐడిఏ– ఏపి చాప్టర్ సెక్రటరీ కమ్ ట్రెజరర్, డైరీ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్, డాక్టర్ వై. రవీంద్రారెడ్డి, విద్యార్థి కార్యకలాపాల ఇన్చార్జ్ అధికారి డాక్టర్ బి.ఎమ్ మంజునాథ, బోధన, బోధనేతర సిబ్బంది, వివిధ స్థానిక కళాశాలల విద్యార్థులు, తిరుపతిలోని శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రపంచాన్ని ఆకర్షిస్తున్న సంప్రదాయ నృత్యం
- ప్రిన్సిపల్ ఉమా ముద్దుబాల

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రపంచంలోని వివిధ దేశాలను భారతీయ సంస్కృతి, సంప్రదాయ నృత్యాలైన భరతనాట్యం, కూచిపూడి ఆకర్షిస్తున్నాయని ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమా ముద్దుబాలా పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర సంగీత,నృత్య కళాశాల ప్రాంగణంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార గ్రహీత డాక్టర్ వసంత కిరణ్ రాయసం కు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవార్డు గ్రహీత అయినటువంటి డాక్టర్ వసంత కిరణ్ శాస్త్రీయ నృత్య శైలి, భరతనాట్యం, కూచిపూడిసేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పురస్కార గ్రహీత డాక్టర్ వసంత్ కిరణ్ ప్రసంగం విద్యార్థులను ఉత్తేజపరుస్తూ ఉపాధ్యాయులను ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమములో విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ కే. దేవేంద్ర పిళ్ళై, మృదంగం విభాగాధిపతి ఎం సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - నారాయణవనం: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆధ్వర్యంలో నారాయణవనం రహదారిపై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్, మాజీ ఎంపీపీలు పి గోవిందస్వామి, నాగలాపురం మాజీ ఎంపీపీ మురళి, బిఎస్‌పి సత్యవేడు నియోజకవర్గ ఇన్ఛార్జి కే ధనంజయులు, అంబేద్కర్ సంఘం జిల్లా నేత మహేష్ గుజ్జేని, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

వర్సిటీ వసతి గృహాల్లో బయట వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి :ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని పలు హాస్టళ్లలో అనధికారికంగా ఆశ్రయం పొందుతున్న బయట వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ఉసిరికాయల అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. వసతిగృహం వార్డెన్, ప్రిన్సిపల్, ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, సైన్స్, ఆర్ట్స్ కళాశాలల బాలుర వసతి గృహాలలో బయట వ్యక్తులకు ఆశ్రయం కల్పించడం ద్వారా వర్సిటీ విద్యార్థులకు, పరిశోధకులకు సంబంధించి అనేక వస్తువులు మాయమవుతున్నాయని, దొంగతనాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పరిశోధకుల వసతి గృహాలైన ఎఫ్, ఐ బ్లాక్ లలో పలువురు పరిశోధకులకు సంబంధించిన విలువైన వస్తువులు, సామాగ్రి దోపిడీకి గురయ్యాయని ఆవేదన చెందారు. అంతేకాకుండా బయట వ్యక్తులు పరిశోధకులను నానా దుర్భాషలు మాట్లాడుతూ కొట్టడానికి కూడా వెనకాడటం



లేదని తీవ్ర మానసిక వేదనకు గురయ్యారని చెప్పారు. వర్సిటీ వసతిగృహాలలో బయట వ్యక్తులు అసాంఘిక, అనైతిక కార్యక్రమాలకు పాల్పడుతూ విద్యార్థులు, పరిశోధకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. వసతి గృహాలలో వర్సిటీ విద్యార్థుల వాహనాల్లోని పెట్రోల్ ను సైతం గత రెండు, మూడు సంవత్సరాలుగా దొంగలించడం జరుగుతుందని పలుమార్లు ఉన్నతాధికారులకు వినతి పత్రాలు ఇచ్చిన సరైన చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీలోని వివిధ బాలుర వసతి గృహాలలో వాచ్మెన్ సిబ్బంది, బ్లాక్ ఇన్చార్జిలు సిబ్బంది కొరతగా ఉందని, ఉన్నతాధికారులు పూర్తి సిబ్బంది నియమించాలని కోరారు. ఇటీవల కాలంలో హెచ్ బ్లాక్, ఐ బ్లాక్, ఎఫ్ బ్లాక్ లలో బయట వ్యక్తులు విద్యార్థులపై దాడి చేసిన సంఘటనలు పోలీస్ స్టేషన్ వరకు వెళ్లాయని అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విద్యార్థులకు, పరిశోధకులకు ఐడి కార్డులు, గుర్తింపు కార్డులను ఇచ్చి, వసతి గ్రహాలలో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించి ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు విద్యార్థులు గాని, బయట వ్యక్తులు గాని పాల్పడిన కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్వీయూలో చదివే విద్యార్థి ఎన్నో ఆశలతో, ఆశయాలతో ఇక్కడికి వస్తే నిస్పృహాలతో వెళ్ళకూడదని, గ్రంథాలయం, కంప్యూటర్ కేంద్రం ఇతర సౌకర్యాలలో విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో సరైన భద్రతతో స్వేచ్ఛగా చదువును కొనసాగించాలని కోరుతున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి పోలీసు వారి సహకారంతో బయట వ్యక్తుల వర్సిటీలో ప్రవేశంపై పూర్తిస్థాయిలో నిఘా ఉంచి నియంత్రించాలని డిమాండ్ చేశారు.